RNI No: TELTEL/2022/83073

వేద న్యూస్

వరంగల్ | శుక్రవారం | పేజీలు 5
సంపుటి: 4 సంచిక:270 | నవంబర్ 13, 2026 | వెల: రూ.3-00

లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260

దినపత్రిక



పోలీస్ శాఖలో భారీ ప్రక్షాళన

21 మంది ఐపీఎస్ అధికారులకు బదిలీలు



వేద న్యూస్, హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖలో ప్రభుత్వం భారీ స్థాయిలో బదిలీలు, నియామకాలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా కీలక పోలీస్ విభాగాల్లో పనిచేస్తున్న 21 మంది ఐపీఎస్ అధికారులకు స్థానచలనం కల్పిస్తూ కొత్త బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం జీఓ ఆర్టీ నెం.1654ను విడుదల చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేస్తున్న వీసీ సజ్జనార్ బదిలీ కావడంతో, ఆయన స్థానంలో మహేష్ మురళీధర్ భగవత్‌ను నియమించారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్‌గా ఉన్న డాక్టర్ సౌమ్య మిశ్రాను డీజీపీ ఉమెన్ అండ్ సేఫ్టీ, షీ టీమ్స్, భరోసా విభాగాలకు నియమించారు. అదనంగా డీజీపీ ఆర్గనైజేషన్, డీజీపీ లీగల్ బాధ్యతలు అప్పగించారు. స్వాతి లక్రాను డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్‌గా నియమించారు. హోంగార్డ్స్ డీజీపీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. సీఐడీ డీజీపీగా ఉన్న చారు సిన్హాను అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్‌గా నియమించారు. సీఐడీ డీజీపీగా అదనపు బాధ్యతలు కూడా అప్పగించారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల డీజీపీగా ఉన్న డాక్టర్ అనిల్ కుమార్‌ను తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ పదవి నుంచి బదిలీ అయిన వీసీ సజ్జనార్‌కు తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డైరెక్టర్ జనరల్ బాధ్యతలు అప్పగించారు. అదనంగా స్పెషల్ పోలీస్ ఫోర్స్ డీజీపీగా నియమించారు. వై. నాగిరెడ్డిని సివిల్ సప్లైస్ కమిషనర్‌గా నియమించారు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, లీగల్ మెట్రాలజీ కంట్రోలర్ బాధ్యతలు కూడా అప్పగించారు.

ఇతర ముఖ్యమైన నియామకాలు

- సంజయ్ కుమార్ జైన్ - ఏడీజీపీ, ట్రైనింగ్ (అదనపు బాధ్యతలు)
- విక్రమ్ సింగ్ మాన్ - డీజీపీ, ఆపరేషన్స్, గ్రేహౌండ్స్, ఆక్టోపస్
- ఎం. స్టీఫెన్ రవీంద్ర - డైరెక్టర్, తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్ మెంట్, రోడ్ అండ్ రైల్ సేఫ్టీ బ్యూరో
- ఆకున్ సబర్వాల్ - ఏడీజీపీ, లా అండ్ ఆర్డర్
- ఎస్. చంద్రశేఖర్ రెడ్డి - డైరెక్టర్, ఏసీబీ
- కార్తికేయ - ఐజీపీ, మల్టీ జోన్-1
- కె. రమేష్ నాయుడు - ఐజీపీ, రైల్వేస్
- డి. జోయల్ డేవిస్ - జాయింట్ డైరెక్టర్, రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్
- ఎల్.ఎస్. చౌహాన్ - డీఐజీ, కోఆర్డినేషన్
- జి. చందన దీప్తి - డీఐజీ, జోన్-7 జోగులాంబ (అదనపు బాధ్యతలు)
- ఆర్. భాస్కరన్ - డీఐజీ, ఇంటెలిజెన్స్ (అదనపు బాధ్యతలు)
- కె. నారాయణ నాయక్ - డీఐజీ, జోన్-2 బాసర (అదనపు బాధ్యతలు)
- శ్రీబాలాదేవి - డిప్యూటీ డైరెక్టర్ (అడ్మిన్), టీజీ-టీఎంఏఆర్ఎస్
- వి. అరవింద బాబు - డీసీపీ, ఎస్ఎం అండ్ ఐటీ, హైదరాబాద్ సిటీ

కీలక విభాగాలకు కొత్త బాధ్యతలు

- హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా మహేష్ భగవత్..
- వీసీ సజ్జనార్‌కు తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్ బాధ్యతలు
- ఏసీబీ డీజీగా చారు సిన్హా..
- జైళ్ల శాఖకు స్వాతి లక్రా

విద్యా మౌలిక వసతుల కల్పనకు నాణ్యమైన నిర్మాణాలు చేపట్టాలి

నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి
యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణ పనులను
పరిశీలించిన కలెక్టర్ సత్య శారద



వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి

విద్యార్థులకు మెరుగైన విద్యా మౌలిక వసతులు కల్పించేందుకు చేపడుతున్న పాఠశాల భవన నిర్మాణాల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. గురువారం వరంగల్ మండలం కొత్తపేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా స్కూల్ భవన పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవంతం చేయాలని, నిర్మాణంలో ఎలాంటి రాజీ పడకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి పుష్పలత రెడ్డి, టీఎస్ఎంఐడీసీ ఇంజనీర్లు అరుణ్ కుమార్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో మార్స్ గ్లోబల్ సామర్థ్య కేంద్రం

ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

- జెన్‌పాక్ట్ భాగస్వామ్యంతో సంస్థ ఏర్పాటు
- తొలిదశలో 400 మందికి పైగా ఉద్యోగులతో కార్యకలాపాలు 12 లో
- రానున్న రోజుల్లో వెయ్యి మందికి ఉపాధి కల్పించే లక్ష్యం
- కృత్రిమ మేధ, సాఫ్ట్‌వేర్, క్లౌడ్ ఇంజినీరింగ్‌పై ప్రత్యేక దృష్టి

22-ఏ దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి

- ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండకూడదు
- కలెక్టర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలి
- పరిష్కారానికి వీలుకాని అంశాలను ఉన్నతస్థాయి కమిటీకి పంపాలి
- అర్హులైన భూ యజమానులకు త్వరగా న్యాయం చేయాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వేద న్యూస్, హైదరాబాద్

ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న 22-ఎ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను క్షేత్రస్థాయిలో వేగంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఇప్పటికే వచ్చిన దరఖాస్తులన్నింటినీ యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని, ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండటానికి వీల్లేదని స్పష్టం చేశారు. పరిష్కార ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి తావివ్వకూడదని సూచించారు. 22-ఎ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఉత్తర్వుల అమలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులపై గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను అధికారులు సమర్థంగా అమలు చేయాలని మంత్రి సూచించారు. జీవో 118, జీవో 76లకు సంబంధించిన మెమోలు, 22-ఎ జాబితాలో ఉన్నప్పటికీ జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ, మున్సిపల్ అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతులు వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసిందని పొంగులేటి తెలిపారు. పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టం కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారం, నాలా ప్రక్రియ పూర్తికాని పట్టా భూముల సమస్యలు, జీవో 59 అమలు వంటి అంశాలపైనా దృష్టి సారించాలని చెప్పారు. ఈ ఉత్తర్వుల ప్రయోజనం అర్హులైన దరఖాస్తుదారులకు అందేలా చూడాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని పేర్కొన్నారు. ప్రతి వారం జిల్లా స్థాయిలో కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్, సంబంధిత అధికారులు సమావేశమై 22-ఎ దరఖాస్తుల పరిష్కారంపై సమీక్షించాలని మంత్రి ఆదేశించారు. జిల్లా స్థాయిలో పరిష్కరించడానికి వీలుకాని అంశాలను రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్‌కుమార్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీకి సిఫార్సు చేయాలని సూచించారు. యూఎల్‌సీకి సంబంధించి వివిధ కోర్టులు ఇచ్చిన తుది తీర్పులు, ప్రభుత్వం తరఫున ప్రత్యేక అనుమతి పిటిషన్లు దాఖలు చేసే అవకాశాలు, అలా చేయడానికి వీలులేని ఇతర అంశాలపై వారం రోజుల్లో సమగ్ర నివేదిక అందించాలని కమిటీని ఆదేశించారు. 22-ఎ జాబితాలోని ప్రతి భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు, రిజిస్ట్రేషన్ వివరాలు, ఇతర ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయాలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ఉన్నతస్థాయి కమిటీ నివేదికను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, క్రమబద్ధీకరణపై తగిన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. నిజమైన భూ యజమానులకు హక్కులు కల్పించే విషయంలో అనవసర జాప్యం జరగకుండా, కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. అర్హులకు న్యాయం చేయడంలో నిర్లక్ష్యం వహించకూడదని, అదే సమయంలో ప్రభుత్వ, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన భూముల విషయంలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు.



ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపై బహిరంగ చర్చకు సిద్ధమా?

కాంగ్రెస్ నాయకులకు పాలకుర్తి మండల బీఆర్ఎస్ నేతల సవాల్

వేద న్యూస్, పాలకుర్తి

ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక, కేటాయింపుల విషయంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల తీరుపై పాలకుర్తి మండల బీఆర్ఎస్ నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇళ్ల ఎంపికలో పారదర్శకత ఉంటే బహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసిరారు. గురువారం పాలకుర్తి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పసునూరి నవీన్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక విషయంలో కాంగ్రెస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపై చర్చించేందుకు కాంగ్రెస్ నాయకులు రాజీవ్ చౌరస్తాకు వస్తారా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులకు అవగాహన లేదని విమర్శించే ముందు కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక, పంపిణీపై ప్రజలకు పూర్తి వివరాలు తెలియజేయాలని అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇళ్ల ఎంపిక, పంపిణీ విషయంలో చోటుచేసుకున్న పరిణామాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంజూరు చేసి పంపిణీ చేసిందో, ప్రస్తుత ప్రభుత్వం ఎంతమందికి ఇళ్లు కేటాయించిందో తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ఆన్‌లైన్ పారదర్శకత లేదని, కాంగ్రెస్ పార్టీ నాయకుల రాజకీయ జోక్యం పెరిగిపోయిందని ఆరోపించారు. అర్హులైన నిరుపేదలకు కాకుండా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యతనిస్తూ ఇళ్లు కేటాయిస్తున్నారని విమర్శించారు. ఇళ్ల మంజూరు పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారంటూ ఆరోపణలు చేశారు. ప్రజా సమస్యలపై ఆధారాలతో చర్చించకుండా విమర్శలకే పరిమితం కావడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రతి గ్రామంలో నిజమైన నిరుపేదలను గుర్తించి, స్థానిక సర్పంచులకు సమాచారం అందించి, గ్రామసభల ద్వారా ప్రజల సమక్షంలో లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్లు రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఉపయోగపడాలని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని కోరారు. గ్రామసభల ద్వారా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టకపోతే పేదల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బొబ్బల అశోక్ రెడ్డి (ఎఫ్ఏసీఎస్ చైర్మన్), కారుపోతుల వేణు (ఎఫ్ఏసీఎస్ చైర్మన్ వైస్ చైర్మన్), బానోత్ మహేందర్ నాయక్ (బీఆర్ఎస్ జిల్లా యువజన నాయకులు), గద్దం కిరణ్ (సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు), గాదేపాక కిరణ్ (పాలకుర్తి మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్), వేరమనేని సోమేశ్వర్ రావు (మండల సీనియర్ నాయకులు), దొంతమళ్ల గణేష్ (మండల సమన్వయ కమిటీ సభ్యులు) తదితరులు పాల్గొన్నారు.



వేద న్యూస్

శుక్రవారం నవంబర్ 13, 2026

తమ్ముడి హత్య కేసులో అన్నకు జీవిత ఖైదు

రూ.2 వేల జరిమానా విధించిన వరంగల్ జిల్లా కోర్టు..
పటిష్ట సాక్ష్యాధారాలతో నిందితుడికి శిక్ష

వేద న్యూస్, వరంగల్ క్రైమ్

కుటుంబ తగాదాల నేపథ్యంలో స్వయానా తమ్ముడిని హత్య చేసిన కేసులో అన్నకు వరంగల్ జిల్లా కోర్టు జీవిత ఖైదు విధించింది. నల్లబెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నందిగామ గ్రామంలో 2024లో జరిగిన ఈ హత్య ఘటనపై విచారణ చేపట్టిన వరంగల్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు నిందితుడు కుండె రవికి జీవిత ఖైదుతో పాటు రూ.2,000 జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెల్లడించింది. కేసు వివరాల్లోకి వెళ్తే.. నందిగామ గ్రామానికి చెందిన కుండె రవి (40), తన స్వయానా తమ్ముడు కుండె కుమార్ (32)తో కుటుంబ తగాదాల నేపథ్యంలో గొడవకు దిగాడు. ఈ క్రమంలో 2024లో కుమార్‌ను గొడ్డలితో నరికి హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటనపై మృతుడి తల్లి కుండె ఇలమ్మ ఫిర్యాదు మేరకు నల్లబెల్లి పోలీసులు క్రైమ్ నంబర్ 18/2024, సెక్షన్ 302 ఐపీసీ కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో వరంగల్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టులో ఎస్సీ నంబర్ 30/2026గా విచారణ కొనసాగింది. విచారణ అనంతరం నిందితుడు కుండె రవికి న్యాయమూర్తి జస్టిస్ నిర్మలా గీతాంబ జీవిత ఖైదుతో పాటు రూ.2,000 జరిమానా విధించారు.

దర్యాప్తు.. ప్రాసిక్యూషన్ వాదనలు

ఈ కేసులో తొలుత అప్పటి దుగ్గొండి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ దర్యాప్తు చేపట్టారు. అనంతరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. రాజగోపాల్ చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రస్తుతం దుగ్గొండి సీఐగా పనిచేస్తున్న జె. శంకర్ రావు కేసు పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే. మురళీధర్ రావు వాదనలు వినిపించారు. కోర్టు లైజనింగ్ అధికారిగా ఎస్ఐ కే. హరికృష్ణ, కోర్టు డ్యూటీ అధికారిగా ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన పీసీ నంబర్ 2473 నామిండ్ల మహేష్ సమన్వయం చేశారు. కేసులో నిందితుడికి శిక్ష పడేలా పటిష్టమైన సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించి సమర్థ వంతంగా విధులు నిర్వహించిన పోలీసు అధికారులను, సిబ్బందిని నర్సంపేట ఏసీపీ పి. రవీందర్ రెడ్డి అభినందించారు. నేరస్తులకు శిక్ష పడేలా దర్యాప్తు అధికారులు, కోర్టు సిబ్బంది సమన్వయంతో పనిచేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆదాయం స్వాహా ఆరోపణలు..

వార్డు అధికారిపై సస్పెన్షన్ వేటు

రూ.1,13,452 ఆస్తి పన్ను మొత్తాన్ని మున్సిపల్ ఖజానాలో జమ చేయకపోవడంపై చర్యలు

వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వసూలు చేసిన ఆస్తి పన్ను మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాలో జమ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 43వ డివిజన్, కాశిబుగ్గ సర్కిల్-1 వార్డు అధికారి ఎం.ఏ. గఫార్ ఖాన్‌ను సస్పెండ్ చేస్తూ ప్రత్యేక అధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఉత్తర్వులు జారీ చేశారు. సదరు వార్డ్ ఆఫీసర్ వసూలు చేసిన రూ.1,13,452 ఆస్తి పన్ను మొత్తాన్ని మున్సిపల్ ఖజానాలో జమ చేయకపోవడాన్ని తీవ్ర ఆర్థిక క్రమశిక్షణా ఉల్లంఘనగా పరిగణిస్తూ, సమగ్ర విచారణ నిమిత్తం ఈ చర్యలు తీసుకున్నారు. సస్పెన్షన్ తక్షణమే అమల్లోకి వస్తుందని, తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు కొనసాగుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సస్పెన్షన్ కాలంలో సంబంధిత అధికారి హనుమకొండలోనే ప్రధాన కార్యాలయాన్ని కలిగి ఉండాలని, అనుమతి లేకుండా కేంద్రాన్ని విడిచి వెళ్లరాదని ఆదేశించారు. అలాగే తన వద్ద ఉన్న మున్సిపల్ రికార్డులు, పన్ను వసూలు రిజిస్టర్లు, రశీదు పుస్తకాలు, నగదు తదితరాలను సంబంధిత అధికారులకు అప్పగించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదాయం విషయంలో ఎలాంటి అవకతవకలు, నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, ప్రజాధనం పరిరక్షణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిందేనని ఈ చర్య ద్వారా ప్రత్యేక అధికారి స్పష్టం చేసారు.

ఘోర రోడ్డు ప్రమాదం.. యువకుడు మృతి

వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి



సెట్టిపాలెం యూటర్న్ వద్ద గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న బూరి లోకేష్ (23) అక్కడికక్కడే మృతి చెందాడు.పోలీసుల వివరాల ప్రకారం.. మాడ్గులపల్లి నుంచి మిర్యాలగూడ వైపు లోకేష్ తన ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, సెట్టిపాలెం యూటర్న్ వద్ద పాములపాడు వైపు వెళ్లేందుకు ట్రాక్టర్ డ్రైవర్ సబ్బు మహేందర్ రెడ్డి (45) అకస్మాత్తుగా ఎలాంటి సిగ్నల్ ఇవ్వకుండా, తగిన జాగ్రత్తలు తీసుకోకుండా యూటర్న్ తీసుకున్నాడు.దీంతో వేగంగా వస్తున్న ద్విచక్రవాహనం ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లోకేష్ తలకు తీవ్ర గాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు.మృతుడు మాడ్గులపల్లి మండలం దాచారం గ్రామానికి చెందిన బూరి రాజలింగం కుమారుడిగా పోలీసులు గుర్తించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మృతుడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై కేసు నమోదు ప్రక్రియ కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

భారత్ సమ్మిట్‌కు మల్లికార్జున ఖర్గేకు భట్టి విక్రమార్క ఆహ్వానం

వేద న్యూస్, హైదరాబాద్



హైదరాబాద్‌లో నవంబర్ 13, 14 తేదీల్లో నిర్వహించనున్న రెండో ఎడిషన్ భారత్ సమ్మిట్‌కు హాజరుకావాలని ఏఐసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గేకు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేకంగా ఆహ్వానం పలికారు. బెంగళూరులో ఖర్గేను మర్యాదపూర్వకంగా కలిసిన భట్టి విక్రమార్క, సమ్మిట్‌కు సంబంధించిన వివరాలను తెలియజేసి కార్యక్రమానికి రావాలని కోరారు. రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో జరగనున్న ఈ సమావేశాలకు ఖర్గే హాజరుకావడం ప్రాధాన్యత సంతరించుకుంటుందని భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. ఈ భేటీ సందర్భంగా ఇరువురు నేతలు పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా సామాజిక న్యాయం, సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతి వంటి అంశాలు చర్చకు వచ్చినట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడం, వెనుకబడిన వర్గాల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టడం వంటి అంశాలపై భారత్ సమ్మిట్‌లో చర్చించనున్న నేపథ్యంలో ఖర్గేకు ఆహ్వానం అందించినట్లు తెలిపారు. ఈ అంశాలపై ఆయనతో అర్థవంతమైన చర్చ జరిగిందని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం మల్లికార్జున ఖర్గే దీర్ఘకాలంగా చేస్తున్న కృషి భారత్ సమ్మిట్ ఆశయాలకు స్ఫూర్తిదాయకమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కులు, వారి అభ్యున్నతి, సమాజంలో సమానత్వం సాధించేందుకు ఖర్గే ప్రదర్శిస్తున్న నిబద్ధత సమ్మిట్ లక్ష్యాలకు అనుగుణంగా ఉన్నాయని వివరించారు. ఈ విలువలకు ప్రాధాన్యతనిస్తూ నిర్వహిస్తున్న సమావేశానికి ఆయన హాజరైతే చర్చలకు మరింత ప్రాధాన్యత చేకూరుతుందని భావిస్తున్నట్లు తెలిపారు. భారత్ సమ్మిట్ రెండో ఎడిషన్‌ను హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నవంబర్ 13, 14 తేదీల్లో జరిగే ఈ కార్యక్రమంలో సామాజిక, రాజకీయ, అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చలు జరగనున్నాయి. సమానత్వం, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల అభ్యున్నతి వంటి అంశాలను సమ్మిట్ ప్రధాన లక్ష్యాల్లో భాగంగా ముందుకు తీసుకెళ్తున్నట్లు భట్టి విక్రమార్క వివరించారు. ఈ నేపథ్యంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నారు.

విధి నిర్వహణలో భేష్.. నరేశ్

సోషల్ సర్వీస్‌లోనూ ముందు వరుసలో..
ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా ఇంజపెల్లికి అవార్డులు
సెక్రెటరీగా ప్రజల ఆదరణ పొందిన యువ అధికారి

వేద న్యూస్, హనుమకొండ

వృత్తి పట్ల అంకితభావం, విధి నిర్వహణకు మొగ్గు చూపే తత్వం ఆయన సొంతం. ఆఫీసు వరకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణకు ప్రాధాన్యతనిస్తూ.. విషయాలను అర్థం చేసుకుంటూ విధులు నిర్వర్తించే సదరు అధికారికి అవార్డులు వరించి వస్తాయి. ఈ కోవకు చెందిన వారే హనుమకొండ జిల్లా దామెర మండల పరిధిలోని ఒగ్లాపూర్ గ్రామ పంచాయతీ సెక్రెటరీ ఇంజపెల్లి నరేశ్. జిల్లా స్థాయి ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా అవార్డు అందుకున్న ఆయన..విధి నిర్వహణలో



'కార్యదక్షుడు'గా పేరుగాంచారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని భూపాలపల్లి మండలం మోరంచపల్లి గ్రామంలో నిరుపేద దళిత కుటుంబానికి చెందిన నరేశ్.. ప్రస్తుతం గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శుల ఫోరం బాధ్యతల్లోనూ కీలకంగా వ్యవహరిస్తూనే.. సోషల్ సర్వీస్‌లోనూ ఆయన ముందు వరుసలో ఉన్నారు. కష్టం విలువ తెలిసిన వ్యక్తి సెక్రెటరీ నరేశ్ అని, విధి నిర్వహణలో అంకితభావం కనబరుస్తూ పనులు చక్కబెడుతారని ఈ సందర్భంగా పలువురు వెల్లడించారు.

విద్యతో పేదరికాన్ని జయించి..

లక్ష్యసాధనకు పేదరికం అసలు అడ్డుకాదని చెప్పడానికి నరేశ్ ప్రత్యక్ష ఉదాహరణ అని చెప్పొచ్చు. తల్లిదండ్రులు ఇంజపెల్లి బుచ్చమ్మ-లక్ష్మయ్యలకు ముగ్గురు సంతానం. కాగా, అందులో పెద్దవాడైన నరేశ్.. చిన్న నాటి నుంచి చదువుపై ఆసక్తి కనబరుస్తూ.. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వాటిని అధిగమించి విద్యను కొనసాగించారు. విద్యాభ్యాసం సమయంలో చదువు, ఖర్చులకు డబ్బులు అందించే ఆర్థిక స్థితి తల్లిదండ్రులకు లేకపోవడంతో నరేశ్.. పార్ట్ టైం కేటరింగ్, కూలీ పని చేస్తూ.. ముందుకు సాగారు. నరేశ్ డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న సమయంలోనే ఆయనకు రైల్వే(ఆర్ఆర్‌సీ)లో గేట్‌మెన్‌గా జాబ్ వచ్చింది. అది చేసుకుంటూనే.. పోటీ పరీక్షలకు సన్నద్ధమై.. పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం సంపాదించడం విశేషం. ఆ పంచాయతీ సెక్రెటరీ ఎగ్జామ్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 32వ ర్యాంకు సాధించి నరేశ్ సత్తా చాటారు. గేట్‌మెన్‌గా జాబ్ చేస్తూ.. ఎలాంటి సెలవులు తీసుకోకుండా సొంతంగా కాంపిటీటివ్ ఎగ్జామ్‌కు ప్రిపేరయి..సెక్రెటరీ జాబ్ సంపాదించారు. నరేశ్‌కు తెలంగాణ ఆవిర్భావం సందర్భంగా జూన్ 2న అప్పటి ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, అప్పటి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు చేతుల మీదుగా 'ఉత్తమ పంచాయతీ సెక్రెటరీ'గా అవార్డు అందుకున్నారు. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లోనూ జిల్లా స్థాయి ఉత్తమ పంచాయతీ కార్యదర్శ అవార్డును అందుకున్నారు. సెక్రెటరీగా విధి నిర్వహణలో స్థానిక ప్రజాప్రతినిధులు, జీపీ సిబ్బంది, ప్రజల సహకారంతో ముందుకు వెళ్తున్నట్టు నరేశ్ వెల్లడించారు. సమస్యల పరిష్కారానికి తన వంతుగా చొరవ తీసుకుంటానని, పెండింగ్‌లో పెట్టకుండా.. మార్గనిర్దేశకాల ప్రకారం.. పై అధికారుల గైడెన్స్‌తో సాల్వ్ చేస్తానని పేర్కొన్నారు.

పింఛన్ల మంజూరులో టార్గెట్ లేదు.. అర్హతే ప్రామాణికం

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం
ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ డాక్టర్ కడియం కావ్య

వేద న్యూస్ , వరంగల్ ప్రతినిధి

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. పింఛన్ల మంజూరులో ఎలాంటి టార్గెట్ లేదని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందిస్తామని తెలిపారు. ధర్మసాగర్ మండలంలోని సుష్మిత గార్డెన్స్‌లో నిర్వహించిన నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధర్మసాగర్, రాంపూర్ గ్రామాలకు చెందిన 58 మంది లబ్ధిదారులకు రూ.19.43 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులు, 27 మంది లబ్ధిదారులకు రూ.27.03 లక్షల కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. తుర్కకాశ గ్రామానికి చెందిన 15 మంది మైనారిటీ లబ్ధిదారులకు రూ.9 లక్షల విలువైన వివిధ రకాల టూల్ కిట్లను పంపిణీ చేశారు. ధర్మసాగర్ మండలంలో ఐదు కేటగిరీల కింద మొత్తం 729 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. ఇందులో 370 మంది వితంతువులకు రూ.7,45,920, 209 మంది దివ్యాంగులకు రూ.8,39,344, 44 మంది ఒంటరి మహిళలకు రూ.88,704, 102 మంది గీత కార్మికులకు రూ.2,05,632, నలుగురు చేనేత కార్మికులకు రూ.8,064 చొప్పున నెలవారీ పింఛన్లు అందనున్నాయి. మొత్తంగా ప్రతి నెలా రూ.18,87,664 లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది.

అర్హులు మిగిలిపోతే గుర్తించి దరఖాస్తు చేయించాలి : ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులు, దివ్యాంగులు పింఛన్ల



కోసం నాలుగైదేళ్లుగా ఎదురుచూస్తున్నారని, వారి సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఐదు కేటగిరీల్లో కొత్తగా 4.50 లక్షల పింఛన్లు మంజూరు చేసిందని వెల్లడించారు. ఇప్పటికే ఉన్న పింఛన్లతో కలిపి సుమారు 45 లక్షల మందికి ఏటా రూ.12 వేల కోట్లతో పింఛన్లు అందిస్తున్నట్లు వివరించారు. గ్రామాల్లో ఇంకా అర్హులైన వారు ఎవరైనా మిగిలిపోతే సర్పంచులు, ఎంపీడీవోలు గుర్తించి దరఖాస్తులు చేయించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ కొందరు రాజకీయ అక్కసుతో విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో పేదలకు ఆశ చూపిన వారు, ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతుంటే జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. గ్రామాల్లోకి వెళ్లి సన్నబియ్యం, ఉచిత విద్యుత్, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పింఛన్ల అమలును పరిశీలించాలని సూచించారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధికి గత మూడేళ్లలో సుమారు రూ.1,600 కోట్ల నిధులు తీసుకొచ్చినట్లు కడియం శ్రీహరి తెలిపారు. అండర్‌గ్రౌండ్ ఆసుపత్రి, ఇంటిగ్రేటెడ్ కార్యాలయ సముదాయం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌తో పాటు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. రానున్న రెండేళ్లలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలబెట్టడమే తన లక్ష్యమని ప్రకటించారు.

మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలి: ఎంపీ కడియం కావ్య

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం మహిళలకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో కాంగ్రెస్ చారిత్రక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. మహిళలకు సర్పంచులుగా అవకాశాలు వచ్చినప్పుడు వారి భర్తలు వారి స్వతంత్ర నిర్ణయాలను, బాధ్యతలను గౌరవిస్తూ ప్రోత్సహించాలని సూచించారు. బీఆర్ఎస్ కుటుంబంలోని పరిణామాలను ప్రస్తావిస్తూ ఎంపీ ఘాటుగా స్పందించారు. సొంత కుటుంబానికి చెందిన మహిళే బయటకు వచ్చి తమ కుటుంబంలోని వ్యక్తులపై, రాష్ట్రాన్ని దోచుకున్నారంటూ ఆరోపణలు చేస్తున్న పరిస్థితిని ప్రజలు గమనించాలని అన్నారు. ఇంటి విషయాలను సాధారణంగా బయటపెట్టని మహిళే ఈ స్థాయిలో మాట్లాడుతోందంటే ఆమె ఆవేదనను అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించారు. సోషల్ మీడియాలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ చేస్తున్న ప్రతికూల ప్రచారాన్ని కాంగ్రెస్ శ్రేణులు తిప్పికొట్టాలని, గ్రామగ్రామాన ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ పరిరక్షణకు, ఎస్సీ, ఎస్టీ, మహిళలు, మైనారిటీల హక్కుల రక్షణకు లౌకిక శక్తులను బలోపేతం చేయాలని కోరారు. మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్న సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యానికి ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో శేషాద్రి, హనుమకొండ డీఆర్‌డీవో శ్రీనివాస్, తహసీల్దార్ భావ్ సింగ్, ఎంపీడీవో అనిల్ కుమార్, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, పింఛన్ల లబ్ధిదారులు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం సహాయనిధి లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో మార్స్ గ్లోబల్ సామర్థ్య కేంద్రం

వేద న్యూస్, హైదరాబాద్

హైదరాబాద్‌లో మార్స్ సంస్థ ఏర్పాటు చేసిన గ్లోబల్ సామర్థ్య కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రారంభించారు. జెన్‌పాక్ట్ భాగస్వామ్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన మార్స్ సంస్థ తన గ్లోబల్ సామర్థ్య కేంద్రం ఏర్పాటుకు హైదరాబాద్‌ను ఎంచుకోవడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ సంస్థలకు అవసరమైన సాంకేతిక సేవల కేంద్రంగా హైదరాబాద్ ఎదుగుతోందని ఈ పరిణామం మరోసారి చాటిచెబుతోందని పేర్కొన్నారు. సుమారు 60 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో తొలిదశలో జెన్‌పాక్ట్‌కు చెందిన 400 మందికి పైగా ఉద్యోగులు పనిచేయనున్నారు. రానున్న సంవత్సరాల్లో మార్స్ సంస్థకు చెందిన ఉద్యోగుల సంఖ్యను వెయ్యికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ విస్తరణతో హైదరాబాద్‌లో సాంకేతిక రంగానికి చెందిన మరిన్ని ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. కేంద్రం కార్యకలాపాలు పెరిగే కొద్దీ ఉద్యోగుల సంఖ్యను కూడా దశలవారీగా పెంచనున్నారు. ఈ కేంద్రంలోని బృందాలు కృత్రిమ మేధ, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, క్లౌడ్ ఇంజినీరింగ్, స్వయంచాలక సాంకేతికత, సమాచార విశ్లేషణ తదితర రంగాల్లో పనిచేయనున్నాయి. మార్స్ సంస్థకు సంబంధించిన అంతర్జాతీయ సాంకేతిక కార్యకలాపాలకు అవసరమైన సేవలను ఇక్కడి నుంచి అందించనున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ కొత్త ఆవిష్కరణలు, సాంకేతిక పరిష్కారాల అభివృద్ధికి ఈ కేంద్రం తోడ్పడనుంది. స్నికర్స్, ఎం అండ్ ఎం, పెడిగ్రీ, రాయల్ కానిన్ వంటి ప్రముఖ బ్రాండ్ల ద్వారా మార్స్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా వినియోగదారులకు సుపరిచితమైంది. ఆహార ఉత్పత్తులు, పెంపుడు జంతువుల సంరక్షణ ఉత్పత్తుల రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ సంస్థ హైదరాబాద్‌లో సాంకేతిక కేంద్రాన్ని ఏర్పాటు చేయడం నగరానికి గుర్తింపు తీసుకొచ్చిందని మంత్రి పేర్కొన్నారు.



ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

- జెన్‌పాక్ట్ భాగస్వామ్యంతో సంస్థ ఏర్పాటు
- తొలిదశలో 400 మందికి పైగా ఉద్యోగులతో కార్యకలాపాలు
- రానున్న రోజుల్లో వెయ్యి మందికి ఉపాధి కల్పించే లక్ష్యం
- కృత్రిమ మేధ, సాఫ్ట్‌వేర్, క్లౌడ్ ఇంజినీరింగ్‌పై ప్రత్యేక దృష్టి

జెన్‌పాక్ట్‌తో కలిసి ఈ కేంద్రాన్ని ప్రారంభించడం ద్వారా మార్స్ సంస్థ తన సాంకేతిక సామర్థ్యాలను మరింత విస్తరించనుంది. మార్స్, జెన్‌పాక్ట్ సంస్థల బృందాలకు మంత్రి శ్రీధర్‌బాబు అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లో ప్రారంభమైన ఈ కేంద్రం విజయవంతంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. తొలిదశలో 400 మందికి పైగా ఉద్యోగులతో ప్రారంభమై, రానున్న సంవత్సరాల్లో వెయ్యి మంది వరకు విస్తరించాలనే లక్ష్యం రాష్ట్రంలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాల పెరుగుదలకు దోహదపడనుంది.

వేద న్యూస్

స్మార్ట్ రేషన్ కార్డుల్లో గ్రామాల పేర్లు తారుమారు

- నేరేడుపల్లికి బదులుగా మైలారం ముద్రణ
- అధికారుల నిర్లక్ష్యంపై బీఆర్ఎస్ యువజన నేత రాకేష్ విమర్శలు

వేద న్యూస్, శాయంపేట

ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల ముద్రణలో తప్పిదాలు చోటుచేసుకుంటున్నాయని బీఆర్ఎస్ జిల్లా యువజన నాయకుడు బేరుగు రాకేష్ విమర్శించారు. నేరేడుపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారుల కార్డుల్లో గ్రామం పేరు నేరేడుపల్లికి బదులుగా మైలారం అని ముద్రించారని తెలిపారు. కీలకమైన గుర్తింపు పత్రాల్లోనే ఇలాంటి తప్పులు జరగడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. కార్డుల పంపిణీకి ముందే లబ్ధిదారుల వివరాలను ఎందుకు పరిశీలించలేదని ప్రశ్నించారు. అధికారులు



వెంటనే తప్పులను సరిచేసి, నేరేడుపల్లి గ్రామస్థులకు సరైన వివరాలతో కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నోముల రవి, కూచిన శ్రవణ్, బండి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మత స్వేచ్ఛను కాపాడాలి..

- మహిళలపై దాడులను అరికట్టాలి
- మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక



వేద న్యూస్, దుగ్గొండి

భారత రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛను ప్రతి ఒక్కరూ గౌరవించాలని వరంగల్ జిల్లా ఫెలోషిప్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ కే. ఆనంద్‌రాజ్ వినయపురి రమేష్ కేరి కోరారు. గురువారం ముద్దునూరులోని ట్రినిటీ బాప్టిస్ట్ చర్చిలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవ మిషనరీలు విద్య, వైద్యం, సామాజిక సేవా రంగాల్లో విశేష సేవలందిస్తున్నాయని తెలిపారు. మహిళలు, మైనర్ బాలికలపై దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నూతన కమిటీ ఎన్నిక.. మండల అధ్యక్షుడిగా పాస్టర్ బి. మురళీపాల్, ఉపాధ్యక్షులుగా దేవేందర్, రాజు, కార్యదర్శిగా వి. రమేష్, సంయుక్త కార్యదర్శిగా ఎం. కుమార్, కోశాధికారిగా పి.ఎస్. రమేష్ కేరి ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పలువురు పాస్టర్లు, మహిళా సమాజం సభ్యులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి

- కలెక్టర్ సత్యశారద
- వరంగల్ ఉర్సులోని బీసీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల సందర్శన

గురుకుల విద్యార్థినుల ఆరోగ్యం, పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధికారులకు సూచించారు. గురువారం వరంగల్ ఉర్సులోని మహాత్మా జ్యోతిరావు ఫూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను సందర్శించి విద్యార్థినులకు అందిస్తున్న ఆహారం, ఆరోగ్య సంరక్షణ, వసతి సౌకర్యాలను పరిశీలించారు. నాణ్యమైన పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడి చలికాలంలో వెచ్చని దుస్తులు ధరించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గురుకులంలో ఏవైనా సమస్యలు ఉంటే ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెలో తెలియజేయాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో బీసీ సంక్షేమ శాఖ అధికారి పుష్పలతరెడ్డి, ప్రిన్సిపాల్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్సైకి అభినందనలు

వేద న్యూస్, మరిపెడ



మరిపెడ నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన బానోత్ వెంకన్నను డీసీసీ ప్రధాన కార్యదర్శి వీసారపు శ్రీపాల్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు అలువాల ఉపేందర్ ప్రజాపతి పాల్గొన్నారు.

వీబీజీ రామ్‌జీ పథకం అమలుపై అవగాహన సమావేశం

వేద న్యూస్, మహాదేవపూర్



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఏ. రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో వీబీజీ రామ్‌జీ పథకం అమలుపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుదల, పర్యావరణ పరిరక్షణకు చేపట్టాల్సిన జలసిరి పనులు, ఊరికి ఒక ఊటకుంట, పంటకుంటలు, ఇంకుడు గుంతలు, చెరువులు, కుంటల పునరుద్ధరణపై వివరించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి నీటి కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో నీటి సంరక్షణ పనులు చేపట్టాలని ఏపీవో శ్రీనివాస్ సూచించారు. గ్రామసభల ద్వారా పనులను ఎంపిక చేసి, నిబంధనల ప్రకారం నాణ్యతతో పూర్తి చేయాలని తెలిపారు. గ్రామస్థాయిలో నీటి పొదుపు, వర్షపు నీటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో రవీంద్రనాథ్ సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరైన లబ్ధిదారులతో నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయించాలని సర్పంచులకు తెలిపారు. సమావేశంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మహా పాదయాత్రకు సన్నాహక సమావేశం

బోయినిపల్లిలో నిర్వహణ పాల్గొన్న జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు



వేద న్యూస్, బోయినిపల్లి

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోని ఆర్ఎంపీ భవన్‌లో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మహా పాదయాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురాం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థ, రాజ్యాంగ సంస్థలను గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యతని అన్నారు. రాజ్యాంగ హక్కులు, ప్రజాస్వామ్య విలువలు, జాతీయ సమగ్రత పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ నాయకత్వంలో నిర్వహించనున్న మహా పాదయాత్రకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, బూత్ అధ్యక్షులు పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురాం కోరారు. ఈ సమావేశంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఉదారి నరసింహచారి, మాజీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి, స్తంభంపల్లి సర్పంచ్ బొంగాని అశోక్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శులు మెరుపుల గంగాధర్‌గౌడ్, రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులు కందారపు వెంకటేష్, మోహన్‌బాబు, వివిధ మోర్చాల మండల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోయినిపల్లిలో రెడ్డి సంక్షేమ సంఘం కార్యాలయం ప్రారంభం



వేద న్యూస్, బోయినిపల్లి

- రెడ్డిల హక్కుల సాధనకు ఐక్యంగా కృషి చేయాలి
- జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన రెడ్డి సంక్షేమ సంఘం కార్యాలయాన్ని జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెడ్డిల హక్కుల సాధనకు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రెండు నెలల్లోనే మండల సంఘం ఏర్పాటుతో పాటు 500కు పైగా సభ్యత్వాలు నమోదు కావడం అభినందనీయమన్నారు. నిరుపేద రెడ్డి కుటుంబాలను వ్యవసాయం, విద్యా రంగాల్లో ఆదుకునేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు రాఘవరెడ్డి, డబ్బు తిరుపతిరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు తిరుపతిరెడ్డిని శాలువాలతో సత్కరించారు. ఈ నెల 15న మండల సంఘం ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు చల్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి కులబాంధవులు, జిల్లా కమిటీ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మిట్టపల్లి శ్రీనివాసరెడ్డి, డబ్బు వెంకట్‌రెడ్డి, నారాయణరెడ్డి, గుడి శ్రీనివాసరెడ్డి, తీపిరెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వే పారదర్శకంగా నిర్వహించాలి



వేద న్యూస్, జగిత్యాల

- కలెక్టర్ బి. సత్యప్రసాద్
- జగదేవ్‌పేటలో క్షేత్రస్థాయిలో పర్యటన

వెల్గటూరు మండలం జగదేవ్‌పేటలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ క్షేత్రస్థాయిలో పర్యటించి భూ రీ సర్వే పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. సర్వే పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూముల హద్దులు, విస్తీర్ణం, రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే వివరాలు నమోదు చేయాలని, సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. సర్వే సమయంలో రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలు, ఫిర్యాదులను వెంటనే పరిశీలించి సాధ్యమైనంత వరకు క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి పనుల పురోగతిని సమీక్షించారు. నిర్మాణాలు వేగవంతంగా పూర్తయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, లబ్ధిదారులకు అవసరమైన సహాయం, మార్గదర్శకత్వం సకాలంలో అందించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో రెవెన్యూ డివిజనల్ అధికారి, గృహ నిర్మాణ, సర్వే శాఖల అధికారులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో ఏటీఎం చోరీకి యత్నం

- గంటల్లోనే నిందితుడి అరెస్ట్
- రైల్వేస్టేషన్ వద్ద నిందితుడిని పట్టుకున్న పోలీసులు

వేద న్యూస్, కామారెడ్డి



కామారెడ్డి పట్టణంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో నగదు చోరీకి యత్నించిన నిందితుడిని పోలీసులు గంటల వ్యవధిలోనే అరెస్ట్ చేశారు. ఏటీఎంలోకి ప్రవేశించిన నిందితుడు సీసీ కెమెరాలను తొలగించి, నగదు తీసుకునేందుకు యంత్రాన్ని ధ్వంసం చేశాడు. ఈ క్రమంలో అలారం మోగడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే గాలింపు చేపట్టి రైల్వేస్టేషన్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై తదుపరి విచారణ కొనసాగిస్తున్నారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుల్ నర్సింలు, హోంగార్డు మోహన్‌రెడ్డిలను జిల్లా ఎస్పీ అభినందించారు.

వేద న్యూస్

శుక్రవారం నవంబర్ 13, 2026

నాణ్యతే ప్రాధాన్యం.. అగ్రస్థానమే లక్ష్యం

- ఏరియా జీఎం ఎం. శ్రీరమేష్
- బెల్లంపల్లి ఏరియాలో బొగ్గు నాణ్యతా వారోత్సవాలు ప్రారంభం

వేద న్యూస్, బెల్లంపల్లి



సింగరేణి బెల్లంపల్లి ఏరియాలో బొగ్గు నాణ్యతా వారోత్స వాలు–2026 గురువారం ప్రారంభ మయ్యాయి. ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీరమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని అధికారులకు, ఉద్యోగులకు నాణ్యతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి నుంచి సరఫరా వరకు ప్రతి దశలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. నాణ్యమైన బొగ్గు సరఫరాతో వినియోగదారుల సంతృప్తి పెరగడంతో పాటు సంస్థపై నమ్మకం బలపడుతుందని తెలిపారు. ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవడంతో పాటు నాణ్యతను కాపాడేందుకు అధికారులు, ఉద్యోగులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బెల్లంపల్లి ఏరియాను అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని కోరారు.

పేద కుటుంబాలకు వైద్య చికిత్సలో సీఎం సహాయ నిధి భరోసా

- 43 మంది లబ్ధిదారులకు రూ.24.55 లక్షల చెక్కుల పంపిణీ

వేద న్యూస్, పాలకుర్తి:



పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య చికిత్స ఖర్చుల భారం తగ్గించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. పాలకుర్తి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పంపిణీ చేశారు. వివిధ అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందిన 43 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.24,55,000 విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్య సమస్యలు ఏ కుటుంబానికైనా అనుకోని ఆర్థిక భారాన్ని మిగులుస్తాయని, ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు వైద్య ఖర్చులను భరించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. అలాంటి కుటుంబాలకు సీఎం సహాయ నిధి ద్వారా అందించే ఆర్థిక చేయూత ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్కరూ మెరుగైన వైద్య చికిత్సకు దూరం కాకూడదన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన బాధితులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందిస్తోందన్నారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ అవసరమైన వారికి అండగా నిలుస్తోందని చెప్పారు. పాలకుర్తి నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి భరోసా ఇచ్చారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరు కావడంతో లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఏఐ రంగంలో తెలుగు భాషా నిపుణులకు విస్తృత అవకాశాలు

- లింక్డ్‌ఇన్ తెలుగు భాషా నిపుణులు డాక్టర్ గీతామాధవి కళా

వేద న్యూస్, హైదరాబాద్



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో తెలుగు భాషా నిపుణులకు విస్తృత ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని లింక్డ్‌ఇన్ తెలుగు భాషా నిపుణులు డాక్టర్ గీతామాధవి కళా తెలిపారు. గురువారం ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో 'తెలుగు భాషసాంకేతికత' అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య వక్తగా పాల్గొన్నారు. ప్రొఫెసర్ కోయి కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గీతామాధవి మాట్లాడుతూ కంప్యూటర్లకు మానవ భాషను అర్థం చేయించే సహజ భాషా ప్రక్రియలో తెలుగు భాషా నియమాలు, వ్యాకరణం, పదజాలంపై అవగాహన అవసరమని తెలిపారు. ఏఐ వ్యవస్థల్లో భాషాపరమైన తప్పులను గుర్తించి సరిదిద్దడం, సమాచార విశ్లేషణ వంటి పనుల్లో తెలుగు నిపుణులకు అవకాశాలు ఉన్నాయని, ఏఐ ట్రైనర్లుగా పనిచేయవచ్చని వివరించారు. విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు గూగుల్ టూల్స్, ఈమెయిల్, వర్డ్, పీడీఎఫ్ వినియోగంపై పట్టు సాధించాలని సూచించారు. తెలుగు, ఆంగ్ల భాషల్లో సంభాషణ, రచనా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని, తమ విద్యార్హతలు, నైపుణ్యాలను లింక్డ్‌ఇన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమ సమన్వయకర్త ప్రొఫెసర్ జె. నీరజ వక్తను పరిచయం చేయగా, ఆచార్య సూర్యనారాయణ మూర్తి, అధ్యాపకులు బి. కేథరీన్ పాల్గొన్నారు. వక్త ప్రసంగంపై ప్రశ్నలకు సమాధానాలు చెప్పిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

వేద న్యూస్, పరకాల



పరకాల మండలం నాగారం గ్రామానికి చెందిన బీజేపీ బూత్ అధ్యక్షుడు కట్టగాని రాజయ్య తల్లి సుశీల ఇటీవల మృతి చెందడంతో బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పగడాల కాళీ ప్రసాదరావు వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజే శారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పరకాల రూరల్ మండల అధ్యక్షుడు కాసగాని రాజ్‌కుమార్ గౌడ్, కట్టగాని శ్రీకాంత్, మాచబోయిన బాబు యాదవ్, అడికల సురేష్, మాచబోయిన క్రాంతి యాదవ్, కొలనుపాక రేవన్ సిద్దు, కక్కు రాజు, గొట్టే మొగిలి, రవి, మహేందర్‌రెడ్డి, సాంబయ్య, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుడి భార్యకు ప్రమాద బీమా చెక్కు అందజేత

వేద న్యూస్, మంచిర్యాల



గాయత్రి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు మంచిర్యాల శాఖ ఖాతాదారుడు నజీర్ మొహమ్మద్ ప్రమాదవశాత్తు మృతి చెందడంతో, ఆయన భార్య ఫాతిమా బీకి రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. గాయత్రి నిర్భయ సేవింగ్స్ ఖాతాపై ఉన్న ప్రమాద బీమా సౌకర్యం కింద కార్పొరేటర్ మహమ్మద్ గౌసుద్దీన్ చేతుల మీదుగా చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ కేలేటి ప్రవీణ్, జి. సుధాకర్, సీనియర్ ఆఫీసర్ ఆర్. రమేష్, జూనియర్ ఆఫీసర్ ఇ. శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు అందిస్తున్న సేవలను వివరించారు. రైతులకు 10.50 శాతం వడ్డీతో వ్యవసాయ రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలు, వ్యాపార రుణాలు అందిస్తున్నట్లు బ్రాంచి మేనేజర్ తెలిపారు. ఖాతాదారుల సౌకర్యార్థం ఏటీఎంలలో 24 గంటల నగదు అందుబాటులో ఉంచడంతో పాటు, పరిసర గ్రామాల్లో బ్యాంకింగ్ కరస్పాండెంట్ల ద్వారా సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు.

వాహన డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం

వేద న్యూస్, బోధన్



డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, నిజామాబాద్ ఆదేశాల మేరకు మోటారు వాహనాల తనిఖీ అధికారి, బోధన్ లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం లయన్స్ క్లబ్ ప్రాంగణంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. బోధన్ డివిజన్ పరిధిలోని ఆటోరిక్షా, క్యాబ్, ఇతర వాహనాల డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా రవాణా అధికారి రమేష్ రాథోడ్ మాట్లాడుతూ సురక్షిత డ్రైవింగ్‌కు మంచి కంటి చూపు అవసరమని, డ్రైవర్లు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు ప్రయాణికులు, ఇతర వాహనదారుల భద్రతకు కంటి ఆరోగ్యంపై శ్రద్ధ అవసరమన్నారు. కార్యక్రమంలో మోటారు వాహనాల తనిఖీ అధికారి జి. అశ్వంత్‌కుమార్, సహాయ మోటారు వాహనాల తనిఖీ అధికారి ఎన్. శ్రీనివాస్, లయన్స్ క్లబ్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూముల సర్వే పనులను పరిశీలించిన ఆర్డీవో

వేద న్యూస్, బోధన్



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల సర్వే పనులను బోధన్ ఆర్డీవో విజయకుమారి పరిశీలించారు. మండలంలోని బండారుపల్లి గ్రామ శివారులో పట్టాదారుల సమక్షంలో జరుగుతున్న సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విట్టల్, ఆర్ఐ గంగాధర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

యాసంగిలో ఆరుతడి పంటలు సాగు చేయడం మేలు

- మండల వ్యవసాయ అధికారి పోరిక జైసింగ్ సూచన

వేద న్యూస్, నడికూడ



యాసంగి సీజన్‌లో రైతులు వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి పోరిక జైసింగ్ సూచించారు. బుధవారం కంఠాత్మకూరు గ్రామ రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆత్మ ఆధ్వర్యంలో రైతు క్షేత్ర పాఠశాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జైసింగ్, వ్యవసాయ శాస్త్రవేత్త బీవీ రాజ్‌కుమార్ మాట్లాడుతూ యాసంగి పంటల సాగు, పంటల మార్పిడి, నీటి యాజమాన్యం, సమగ్ర చీడపీడల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం అనిశ్చితి, భూగర్భ జలాల తగ్గుదలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు పంట ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు జంగే భాస్కర్, జోరు ప్రశాంత్, సూత్రపు గోపినాథ్, మాదారపు రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండ

- కుమారుడు హేమంత్ గౌడ్‌కు ఆర్టీసీలో ఉద్యోగం
- రికార్డ్ ట్రెజరర్‌గా నియామక ఉత్తర్వులు జారీ

వేద న్యూస్, నర్సంపేట

గతంలో ఆత్మహత్య చేసుకున్న నర్సంపేట ఆర్టీసీ డిపో డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. బాధిత కుటుంబానికి ఇచ్చిన హామీ మేరకు ఆయన కుమారుడు హేమంత్ గౌడ్‌కు తెలంగాణ ఆర్టీసీలో ఉద్యోగం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రికార్డ్ ట్రెజరర్‌గా ఉద్యోగ అవకాశం కల్పించింది. ఈ మేరకు హైదరాబాద్ సచివాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హేమంత్ గౌడ్‌కు నియామక పత్రం అందజేయనున్నారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని ఇచ్చిన హామీని మంత్రి నిలబెట్టుకోవడంతో బాధిత కుటుంబానికి ఊరట లభించింది.

సర్వే విభాగంలో హై ఎండ్ కంప్యూటర్లను ప్రారంభించిన జీఎం

వేద న్యూస్, మందమరి



సింగరేణి మందమరి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని సర్వే విభాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన హైఎండ్ కంప్యూటర్లను ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనింగ్ కార్యకలాపాల్లో సర్వే విభాగం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అధునాతన కంప్యూటర్ల వినియోగంతో సర్వే డేటా విశ్లేషణ, మ్యాపింగ్, ఇతర సాంకేతిక పనుల్లో వేగం, ఖచ్చితత్వం పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కేకేఓసీపీ ప్రాజెక్టు ఆఫీసర్ రాంబాబు, డీజీఎం (సర్వే) ముఖ్య దేశాయ్, ఐటీ మేనేజర్ రవి, జూనియర్ సర్వే అధికారులు నరేష్, సదానందం, సర్వే విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మందమరి ఏరియాలో బొగ్గు నాణ్యతా వారోత్సవాలు ప్రారంభం

- నాణ్యతే ప్రగతికి ప్రమాణికం.. పరిరక్షణ అందరి బాధ్యత
- జీఎం ఎన్. రాధాకృష్ణ



వేద న్యూస్, మందమర్రి

సింగరేణి మందమరి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో గురువారం బొగ్గు నాణ్యతా వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నాణ్యతే ప్రగతికి ప్రమాణికం.. దాని పరిరక్షణ అందరి బాధ్యత అనే నినాదంతో నవంబర్ 12 నుంచి 18 వరకు వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ నాణ్యతా పతాకాన్ని ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ 136 ఏళ్లుగా విద్యుత్ ఉత్పత్తి సంస్థలు, ఇతర పరిశ్రమలకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేస్తూ దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. మందమరి ఏరియా బొగ్గు ఉత్పత్తి, నాణ్యత, డిస్పాచ్‌లో ముందంజలో ఉందని తెలిపారు. ఇటీవల ఒకే రోజు మూడు రేకుల ద్వారా సుమారు 13 వేల టన్నుల బొగ్గును డిస్పాచ్ చేయడం విశేషమన్నారు. ప్రస్తుతం ఏరియా 100 శాతం ఉత్పత్తి లక్ష్యాన్ని సాధిస్తూ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు అధికారులు, కార్మికులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో టు జీఎం జి.ఎల్. ప్రసాద్, డీజీఎం పర్సనల్ సీహెచ్. అశోక్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, సీఎంఓఏఐ వైస్ ప్రెసిడెంట్ రవి, క్వాలిటీ మేనేజర్ ప్రదీప్, ఏఐటీయూసీ జీఎం స్ట్రక్చర్ కమిటీ సభ్యుడు సీవీ రమణ, ఫిట్ సెక్రటరీ సృజన గీతిక, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేద న్యూస్

గ్రామాల అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- ప్రజలకు మెరుగైన సేవలందించాలి
- అధికారులకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి దిశానిర్దేశం

వేద న్యూస్, నల్లగొండ ప్రతినిధి

మండలంలోని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధికారులకు సూచించారు. గురువారం వేములపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, సామర్థ్యవృద్ధి కార్యక్రమాల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. గ్రామాల్లోని సమస్యలను తెలుసుకుని అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను



పరిష్కరించాలని సూచించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని, పనుల్లో నాణ్యత, పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. సమావేశంలో మండల అధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌కు బదులుగా మరో వ్యక్తితో బియ్యం పంపిణీ

- మామాదాపురంలో రేషన్ పంపిణీపై ఆరోపణలు
- విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్

వేద న్యూస్, నిఘా విభాగం



మండలంలోని మామాదాపురం గ్రామంలో రేషన్ బియ్యం పంపిణీ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రేషన్ డీలర్ ఆధ్వర్యంలో జరగాల్సిన పంపిణీకి బదులుగా మరో వ్యక్తి ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. డీలర్‌కు బదులుగా మరో వ్యక్తి బియ్యం పంపిణీ చేయడానికి అధికారుల అనుమతి ఉందా? నిబంధనలు పాటిస్తున్నారా? అని గ్రామస్తులు ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై పౌరసరఫరాల శాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి, అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రేషన్ అందించాలని డిమాండ్ చేశారు.

నిర్ణీత గడువులోగా గ్రంథాలయ భవన నిర్మాణం పూర్తి చేయాలి



వేద న్యూస్, నారాయణపేట

- నాణ్యతా ప్రమాణాలతో పనులు వేగవంతం చేయాలి
- కలెక్టర్ ప్రియాంక

జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న గ్రంథాలయ భవన పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ సీహెచ్. ప్రియాంక అధికారులను ఆదేశించారు. గురువారం ఎర్రగుట్ట వద్ద నిర్మాణంలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, అధికారులతో కలిసి పరిశీలించారు. రూ.1.53 కోట్లతో చేపట్టిన ఈ నిర్మాణంలో ఇప్పటివరకు రూ.90 లక్షల విలువైన పనులు పూర్తయ్యాయని అధికారులు వివరించారు. పఠన మందిరం, నిల్వ గది, ఇతర మౌలిక సదుపాయాల పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ప్రశాంతమైన వాతావరణం, తాగునీరు, గాలి, వెలుతురు వంటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. గ్రంథాలయం పక్కనే నిర్మిస్తున్న నీటి ట్యాంకు పనులను కూడా పరిశీలించి డిసెంబర్‌లోగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయానికి ఎదురుగా సివిల్ లైన్స్‌లో ఉన్న పాత ఏరియా ఆసుపత్రి భవనాన్ని పరిశీలించి, దాని ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్తులో చేపట్టాల్సిన చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

వీబీజీ రామ్ జీ పనులను గడువులోగా పూర్తి చేయాలి

- లక్ష్యాల సాధనకు వేగం పెంచాలి - కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

వేద న్యూస్, ములుగు



వీబీజీ రామ్ జీ పథకం కింద జిల్లాలో చేపట్టిన పనులను వేగవంతం చేసి, నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. పనుల అమలులో జాప్యం లేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎం. సంపత్‌రావుతో కలిసి అన్ని మండలాల ఎంపీడీవోలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా పనుల పురోగతి, లక్ష్యాల సాధనకు తీసుకుంటున్న చర్యలు, ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పనులను పరిశీలిస్తూ, జాప్యానికి కారణాలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. అధికారుల సమన్వయంతో పనులను నాణ్యతతో పూర్తి చేసి, గ్రామీణ ప్రజలకు ప్రయోజనం చేకూర్చాలని ఆదేశించారు. సమావేశంలో అన్ని మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాలకు ఇప్పటి నుంచే సమగ్ర ఏర్పాట్లు చేయాలి

- అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ప్రణాళిక రూపొందించాలి
- ఏడు రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలి
- కలెక్టర్ అంకిత్

వేద న్యూస్, భద్రాద్రి కొత్తగూడెం



గోదావరి పుష్కరాలు-2027కు భద్రాచలం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఎస్పీ రోహిత్ రాజు, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, వివిధ శాఖల అధికారులతో పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. భద్రాచలం ఆలయానికి వెళ్లే రహదారుల అభివృద్ధికి వంతెన నుంచి ఆలయం వరకు రూ.14 కోట్లు, బండ్ నుంచి ఆలయం వైపు రూ.2.60 కోట్లతో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. కొత్త ఘాట్ల నిర్మాణం, పాత ఘాట్ల మరమ్మతులు, దుమ్ముగూడెం ఘాట్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. బూర్గంపాడు మండలం మోతే వద్ద వీఐపీ ఘాట్ ఏర్పాటును పరిశీలించాలని తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా భద్రాచలం, బూర్గంపాడు, మణుగూరు, దుమ్ముగూడెం ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. సారపాక పుష్కరవనంలోని 75 ఎకరాల స్థలాన్ని పరిశీలించడంతో పాటు అవసరమైన అదనపు భూములను గుర్తించాలని సూచించారు. ప్రైవేటు భూముల వినియోగం అవసరమైతే రైతులతో ముందుగానే చర్చించి పరిహారంపై స్పష్టత ఇవ్వాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, సూచిక బోర్డులు, లైటింగ్ ఏర్పాట్లపై ఎస్పీ రోహిత్ రాజు సూచనలు చేశారు. భక్తుల కోసం క్యూలైన్లు, తాగునీరు, ప్రసాదం, అన్నదాన కేంద్రాలు, తాత్కాలిక ఆసుపత్రులు, వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లు, మరుగుదొడ్లు, పారిశుధ్య ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భక్తులు, ప్రముఖుల వసతి సౌకర్యాలపై కూడా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. కన్సల్టెంట్ ఏడు రోజుల్లో సమగ్ర నివేదిక, తాత్కాలిక సదుపాయాలపై రెండు రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక అందించాలని స్పష్టం చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పుష్కరాలకు అవసరమైన పనులను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

తిరుపతిలో ఏరియా డామినేషన్ కార్యక్రమం

వేద న్యూస్ తిరుపతి :



తిరుపతి నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడమే లక్ష్యంగా పోలీసులు ఏరియా డామినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని ఆయా ప్రాంతాల్లో పోలీసుల ఉనికిని చాట డంతో పాటు, అసాంఘిక కార్యకలా పాలకు అడ్డుకట్ట వేసేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేలా భద్రతా చర్యలను బలోపేతం చేయడంపై పోలీసులు దృష్టి సారించారు. ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిస్థితులను పర్యవేక్షిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించడమే ఈ కార్యక్రమం ఉద్దేశంగా పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం ద్వారా ప్రజలకు భద్రతపై నమ్మకం కల్పించేందుకు పోలీసు శాఖ ప్రయత్నిస్తోంది. ఈ తరహా కార్యక్రమాలతో సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా పెంచి, శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. నగరంలో ప్రజలకు భద్రత కల్పించడం, చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టడం పోలీసుల ప్రధాన బాధ్యతల్లో భాగం. ఈ నేపథ్యంలో తిరుపతిలో నిర్వహించిన ఏరియా డామినేషన్ కార్యక్రమం ద్వారా భద్రతా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడంపై దృష్టి సారించారు. పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం శాంతిభద్రతల పరిరక్షణకు చేపట్టిన చర్యల్లో భాగంగా నిలిచింది. ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందిస్తూ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ఇటువంటి చర్యలు చేపడుతున్నట్లు పోలీసు శాఖ వెల్లడించింది.

మృతి చెందిన ఏపీఎస్‌పీఎఫ్ ఉద్యోగి కుటుంబానికి రూ.3.82 లక్షల ఆర్థిక సాయం



వేద న్యూస్ విజయవాడ :

- కుటుంబానికి అండగా నిలిచిన 2000 బ్యాచ్ రియల్ హెల్పింగ్ గ్రూప్
- సమిష్టిగా నిధులు సేకరించిన సభ్యులు
- మృతుని భార్యకు నగదు అందజేత
- పిల్లల భవిష్యత్తుకు భరోసా కల్పించే ప్రయత్నం

విధి నిర్వహణలో ఉన్న ఏపీఎస్‌పీఎఫ్ ఉద్యోగి మరణంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబానికి తోటి ఉద్యోగులు, సహచరుల బృందం అండగా నిలిచింది. విజయవాడ ఏపీఎస్‌పీఎఫ్ గార్డ్స్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మహమ్మద్ ఖాజా మొయినుద్దీన్ అక్టోబర్ 31న మరణించారు. ఆయన కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో 2000 బ్యాచ్ రియల్ హెల్పింగ్ గ్రూప్ సభ్యులు సమిష్టిగా రూ.3,82,000 సేకరించి అందజేశారు. మహమ్మద్ ఖాజా మొయినుద్దీన్‌కు భార్య బషీరున్నీసాతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమారుడు ఎంబీబీఎస్ చదువుతుండగా, కుమార్తె ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. కుటుంబానికి ప్రధాన అండగా ఉన్న ఆయన మరణంతో పిల్లల చదువులు, భవిష్యత్తు బాధ్యతలను దృష్టిలో ఉంచుకుని ఆర్థిక సహాయం అందించాలని గ్రూప్ సభ్యులు నిర్ణయించారు. 2000 బ్యాచ్ రియల్ హెల్పింగ్ గ్రూప్ సభ్యులు తమ వంతు సహకారాన్ని అందిస్తూ మొత్తం రూ.3 లక్షల 82 వేల నిధులను సమీకరించారు. ఈ మొత్తాన్ని మృతుని కుటుంబానికి అందజేయడం ద్వారా కష్టకాలంలో వారికి తోడుగా నిలిచారు. పిల్లల విద్యాభ్యాసం, కుటుంబ అవసరాలకు ఈ సహాయం ఉపయోగ పడుతుందనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. విజయ వాడలోని ముత్యాలంపాడు జీపీపీ ఏపీఎస్‌పీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో విజయవాడ జోన్ ఏపీఎస్‌పీఎఫ్ కమాండెంట్ ముద్దాడ శంకరరావు చేతుల మీదుగా ఆర్థిక సహాయాన్ని బషీరున్నీసాకు అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగి కుటుంబానికి సహాయం అందించేందుకు ముందుకు వచ్చిన 2000 బ్యాచ్ గ్రూప్ సభ్యుల చొరవను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఏపీఎస్‌పీఎఫ్ గార్డ్స్ అసిస్టెంట్ కమాండెంట్ హేమసుందర్, ఇన్‌స్పెక్టర్లు, 2000 బ్యాచ్ రియల్ హెల్పింగ్ గ్రూప్ సభ్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఉద్యోగి మరణంతో ఇబ్బందుల్లో ఉన్న కుటుంబానికి సమిష్టి సహకారంతో ఆర్థిక సాయం అందించడం ద్వారా మానవీయతను చాటుకున్నారు.

సీఐఐ సదస్సులో పాల్గొన్న నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి

వేద న్యూస్ విశాఖపట్నం :



విశాఖపట్నంలో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక సీఐఐ భాగస్వామ్య సదస్సులో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం చేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ సదస్సులో ఆమె భాగ స్వామ్యమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులు, పరిశ్రమల స్థాపనకు ఉన్న అవకాశాలపై సదస్సు ప్రధానంగా దృష్టి సారించింది. ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు, పారిశ్రామిక కార్యకలాపాలకు ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా వెల్లడించారు. రాష్ట్రంలో పరిశ్రమల విస్తరణకు అనుకూల వాతావరణం కల్పించడం, పెట్టుబడిదారులను ఆకర్షించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ప్రతినిధులు ఒకే వేదికపైకి వస్తున్నారు. రాష్ట్రంలో నూతన పరిశ్రమల స్థాపనకు ఉన్న అవకాశాలను వివరించడంతో పాటు, పెట్టుబడుల ద్వారా పారిశ్రామిక రంగాన్ని విస్తరించే అంశాలపై చర్చలకు ఈ సదస్సు వేదికగా నిలుస్తోంది.కొత్త పరిశ్రమలు ఏర్పాటైతే యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, స్థానికంగా ఆర్థిక కార్యకలాపాలకు ఊతం లభిస్తుందని సదస్సు లక్ష్యాల్లో భాగంగా పేర్కొన్నారు. పారిశ్రామిక ప్రగతిని ప్రాంతీయ అభివృద్ధితో అనుసంధానిస్తూ ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలనే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వివరించారు. నెల్లిమర్ల నియోజకవర్గ అభివృద్ధితో పాటు రాష్ట్రవ్యాప్తంగా పారిశ్రామిక రంగం విస్తరణకు దోహదపడే కార్యక్రమాలపై ప్రజాప్రతినిధులు దృష్టి సారిస్తున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073